# వినాయకుని విలాస యాత్ర

-- రాధిక నోరి

ఒక రోజు వినాయకుడికి ఎక్కడికన్నా విలాస యాత్రకి వెళ్ళాలని ఒక కోరిక పుట్టింది. చాలా రోజుల నుండి ఎక్కడికీ వెళ్ళకపోవటం వలన కొంచెం విసుగ్గా వుంది. ఎప్పుడన్నా మార్పు కోసం ఎక్కడికన్నా వెళ్ళాలనిపిస్తే సత్యలోకం, విష్ణులోకం, ఇంద్రలోకం వెళ్ళటం అలవాటే! కానీ ఇప్పుడు వేరే ఇంకెక్కడికైనా వెళ్ళాలని వుంది. అస్తమానూ భక్తియేనా? భక్తి తో పాటు కాస్త కులాసా, విలాసాలు కూడా కావాలనిపిస్తోంది. వెంటనే మూషికరాజుని వెంటబెట్టుకుని అనుమతి కోసం తల్లితండ్రుల దగ్గరికి వెళ్ళాడు. ఏదో కారణం వుండటం వల్లనే వేళ కాని వేళ కొడుకు తమ దగ్గరికి వచ్చాడని పార్వతి గ్రహించింది. "ఏమిటి నాయనా! ఇలా వచ్చావు?" అని అడిగింది ప్రేమగా. "చాలా రోజుల నుండీ ఎక్కడికీ వెళ్ళలేదు. మార్పు కోసం ఎక్కడికన్నా వెళ్ళాలని వుంది అమ్మా!" అన్నాడు వినాయకుడు గారాలు పోతూ. "ఎక్కడికి వెళ్తావు బాబూ? సత్యలోకమా? లేక విష్ణులోకమా?" అని అడిగింది పార్వతి కుతూహలంగా. అస్తమానూ అక్కడికేనా అనుకున్నాడు మనసులో విసుగ్గా వినాయకుడు. "ఈసారి భూలోకానికి వెళ్ళాలని వుందమ్మా! భూలోకం చాలా చిత్రవిచిత్రాలతో కూడి వుంటుందని, అక్కడి ప్రజలందరూ నాట్య, గానాభిమానులనీ, కులాసాగా సమయం గడపటానికి అది చాలా అనువైన చోటని తమ్ముడు ఎప్పుడూ చెపుతూ వుంటాడు" అన్నాడు గోముగా. తన నెమలి వాహనం మీద ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాలనిపించినా శీఘ్రమే అక్కడికి ఎగిరిపోయే తమ్ముడు కుమారస్వామి గుర్తొచ్చి ఒక్క క్షణం మనసులో కాస్తంత అసూయ కదలాడింది. భూలోకం మాట వినగానే పార్వతి చాలా భయపడిపోయింది. "భూలోకమా! చిత్రవిచిత్రాలతో పాటు మాయామర్మాలు కూడా అక్కడ ఎక్కువ బాబూ! గానం కోసం గంధర్వలోకం, నాట్యం కోసం నాగలోకం మనకి వుండనే వున్నాయి కదా!" అని ఆమె ఇంకా ఏదో అనబోతూ వుంటే "అక్కడికి నేను చాలాసార్లు వెళ్ళానమ్మా! ఎప్పుడూ చూడని కొత్త చోటుకి వెళ్ళాలని కోరికగా వుందమ్మా! తమ్ముడు బోలెడన్ని సార్లు వెళ్ళాడు" అన్నాడు గబగబా. ఇంక శంకరుడికి కల్పించుకోక తప్పలేదు. వినాయకుడు తనకు తెలీకుండానే కుమారస్వామితో వంతులు పోతున్నాడని, ఎప్పుడూ వెళ్ళే ఊర్ధ్వలోకాలు కాకుండా పూర్తిగా అపరిచితమైన భూలోకానికి వెళ్ళి అక్కడి వింతలు, విడ్డూరాలు చూడటానికి బాగా ఉత్సాహపడుతున్నాడని ఆయనికి అర్థం అయిపోయింది. "వెళ్ళనీలే పార్వతీ! చిరంజీవి అన్నట్లుగా ఎప్పుడూ చూసిన చోటుకే ఎందుకు? అదీగాక భూలోకం మరీ అంత ప్రమాదకరమైన ప్రదేశం ఏమీ కాదులే!" అన్నాడు చిరునవ్వుతో. వినాయకుడికి తండ్రి మాటలతో వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. కానీ పార్వతికి మాత్రం ఇంకా భయం పోలేదు. "భూలోకంలో మానవులు కొత్త కొత్త మారణాయుధాలు కనిపెట్టారట. బ్రతుకు మీద తీపిని వదిలేసుకుని తమని తాము అంతం చేసుకుంటూ చుట్టూ వున్నవారిని కూడా చంపుతున్నారట" అంటూ ఇంకా ఏదో అనబోతూవుంటే "భయపడకు పార్వతీ! చెడు పక్కనే ఎప్పుడూ మంచి కూడా వుంటుంది. మనబ్బాయి ఏదో కులాసాగా భూలోకానికి చూడటానికి వెళ్ళొస్తానని అంటే నీ అనవసర భయాలతో లేనిపోని అవాంతరాలు చెప్పకు. అక్కడ తేలికగా సంచరించటానికి ఉపయోగపడే తెలివితేటలు, భాషాపరిజ్ఞానం అబ్బాయితోపాటు మూషికానికి కూడా ప్రసాదిస్తున్నాను" అన్నాడు శివుడు. మూషికంతో సహా వినాయకుడు తల్లితండ్రులిద్దరికీ ప్రణామం చేసాడు. పార్వతి మనసుకి ఇంకా ఉపశమనం కలగలేదు. "జాగ్రత్త నాయనా! ఆకాశంలో సంచరిస్తున్నపుడు ఆకాశాన్నంటే సౌధాల దగ్గర చాలా చాలా జాగ్రత్తగా వుండు. ఆకాశంలో పయనించే వాహనాలతో ఆ భవనాలని కూలగొడుతున్నారట. కాస్తైనా ఏమరపాటు కూడదు సుమా!" అంటూ పదేపదే వినాయకుని హెచ్చరిస్తూ ఆ తల్లి మనసు ఆరాటపడింది. ఎందుకన్నా మంచిది, తోడుగా తమ్ముడిని కూడా తీసుకెళ్ళమని చెపుదామని ఎంతో అనిపించింది. అయినా వినాయకుడికి ఆ సలహా నచ్చుతుందో, లేదో, పైగా కోపం కూడా వస్తుందేమోనన్న అనుమానంతో పైకి ఏమీ అనలేదు. "విశాలమైన ఆ భూలోకంలో మొదటగా ఎక్కడికి వెళదామని అనుకుంటున్నావు నాయనా?" అని అడిగింది ఎంతో ఆరాటంగా. "భారతదేశం అమ్మా!" అన్నాడు వినాయకుడు వెంటనే ఏమాత్రం తడుముకోకుండా. ఆ దేశాన్ని గురించి, అక్కడి వింతలు, విడ్డూరాలు, ప్రత్యేకతల గురించి తమ్ముడు చేసిన పొగడ్తలు ఒక్కసారి గుర్తొచ్చాయి వినాయకునికి. భారతదేశం పేరు వినగానే పార్వతి ఆరాటం కాస్త ఉపశమించింది. ’అక్కడ ప్రజలు దైవ భక్తులట. సంగీత, సాహిత్య, నాట్య శాస్త్రాలలో ప్రవీణులట. భూలోకంలో మొదటగా చూడటానికి భారతదేశం మంచి ప్రదేశమే! నా బిడ్డకి అక్కడేమీ అపాయం వుండదు’ అనుకుంది మనసులో నిబ్బరంగా. అయినా "మొదటిసారి వెళ్తున్నావు. ముచ్చటగా మూడు రోజులు మాత్రం గడిపి వచ్చేయి తండ్రీ!" అంది బెంగగా. పొంగే పాలమీద నీళ్ళు చల్లినట్లు తల్లి మాటలు వినాయకుడిని నిరుత్సాహపరిచినా ఆయనకి సరే అనక తప్పలేదు. వినాయకుని ముఖం చూడగానే మూషికానికి ఆయన మనసులో మొదలైన నిరుత్సాహం అర్థం అయిపోయింది. "స్వామీ! ఏమీ నిరుత్సాహపడకండి. ఒక దినమంటే గణనంలో మనకి, భూలోకవాసులకీ చాలా తేడా వుంది. మనకు ఒక దినమంటే వారికి చాలా దినాలు" అంటూ మూషిక రాజు వినాయకుని రహస్యంగా ఓదార్చాడు.

వినాయకుడు మూషిక రాజుతో పాటు ఎంతో ఉత్సాహంగా

భూలోకంలో దిగాడు. కానీ అక్కడి ప్రజలు ఏ వూరిలో చూసినా, ఏ వేళలో చూసినా చాలా హడావిడిగా కనిపించారు. చాలామంది ఏదో పరికరం చెవి దగ్గర పెట్టుకుని అస్తమానూ ఏవో అంకెలను నొక్కుతూ కనిపించారు. దాన్ని ఫోను అంటారట. వాళ్ళు SMS చేస్తున్నారట. ఇప్పుడు భారతదేశంలో ప్రజల మనోరంజనం కోసం టి.వి. లలో అనేక reality show లు మొదలైనాయని, వాటిలో పాల్గొన్న కళాకారులను ఎన్నుకొనటంలో అందరూ నిమగ్నులైనారని మూషికరాజు వినాయకునికి విడమరిచి చెప్పాడు. చిన్న పిల్లల దగ్గర నుండి పెద్దల దాకా అందరూ నాట్య గానాల పోటీలలో పాల్గొనటానికి చాలా పరిశ్రమ చేస్తున్నారు. అత్యద్భుతంగా పాడుతున్నారు. కళ్ళు చెదిరేలా ఆడుతున్నారు. వింటున్నవాళ్ళు, చూస్తున్నవాళ్ళు అమితంగా ఆనందిస్తున్నారు. లలితకళలలో జనానికున్న ఈ ఆసక్తికి, సేర్పరితనానికి వినాయకునికి తెగ ముచ్చట వేసింది. ప్రతి కుటుంబంలోని పెద్దలు వారి పిల్లలకి ఏలాంటి సంకోచం, ఆక్షేపణ లేకుండా నాట్యగానాలలో శిక్షణ ఇప్పించి వారిచేత ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. పోటీలలో పాల్గొనేలాగా చేస్తున్నారు. వారి పట్టుదల, పరిశ్రమలు నిజంగా చాలా ప్రశంసనీయాలు అనుకున్నాడు వినాయకుడు. ఇంతలో పెద్దపెద్ద వాహనాలు కొన్ని అక్కడికొచ్చి ఆగాయి. వాటిని van లు అంటారట. చాలా పెద్దగా వున్నాయి. బాగా ఖరీదు కూడా వుండచ్చు. బిలబిలలాడుతూ వాటిల్లోంచి చాలామంది దిగారు. వారిలో కొంతమంది దగ్గర వయొలిన్, సితారు, కీబోర్డు, తబలాలాంటి సంగీత వాయిద్యాలు వున్నాయి. వారందరూ అనేక టి.వి.channels లోని reality show లలో సంగీతం సమకూర్చే సంగీత కళాకారులు, గాయనీగాయకులు, వాయిద్య నిపుణులట. Reality shows లో పాల్గొనటం ఎక్కువవటం వలన, పేరు ప్రఖ్యాతులతో బాటు డబ్బు కూడా బాగా సంపాదించి అలా ధనవంతులైపోయారట. ఇంకొంతమందేమో ఫోను కంపెనీల అధిపతులట. Reality shows లోని voting కొరకు ప్రజలు వెచ్చించే వెల వలన వీరు కుబేరులయ్యారట. ఈ విషయాలన్నీ విన్న వినాయకుడు ఆశ్చర్యంతో ఔరా! అనుకుంటూ ముక్కు మీద వేలేసుకున్నాడు. ఇంతలో చిన్నపిల్లల విద్యాలయాల దగ్గర బోలెడంతమంది పిల్లలని చూసాడు. చాలామంది పిల్లలు కొంచెం వంగి నడుస్తున్నారు. భారతదేశంలో పిల్లలకి, పాపం, చిన్న వయసులోనే ఇలా వంగిపోయి నడిచే కొత్తరకమైన జబ్బేమన్నా వచ్చిందేమో అని వినాయకుడు ఆందోళన పడుతూవుంటే అదేమీ జబ్బు కాదని, రోజూ విద్యాలయాలకు తీసుకెళ్ళే పుస్తకాల సంచీల బరువుకి వారి నడుములు అలా వంగిపోయాయని మూషికరాజు వినాయకుడికి విశదీకరించాడు. పాపం, ఇదంతా వయసుని మించిన చదువు ప్రభావం అన్నమాట అనుకున్నాడు ఆ పిల్లల మీద జాలిపడుతూ. ఇంట్లో ఎంతో ఆశక్తికరమైన టి.వి. కార్యక్రమాలు, బయట పాటలు, ఆటలు, చలనచిత్రాలు, నాటకాలు, నాట్యాలు, అనేకమైన వ్యాపకాలు, తోటి పిల్లలతో చాలా గాఢమైన పోటీలు, విపరీతమైన జనాభా తొక్కిడి, వీటన్నిటి మధ్య ధ్యాసగా కష్టపడి చదవాలంటే, పాపం, భారతదేశంలో విద్యార్థి దశ ఎంత క్లిష్టతరమైనది అనుకుని వారందరి మీద చాలా జాలి పడ్డాడు. ఈసారి నుండీ తనని ప్రార్థించే ప్రతి విద్యార్థికీ చాలా ఉదారంగా, ధారాళంగా చదువుని ప్రసాదించాలని నిర్ణయించుకున్నాడు. ఆకాశంలోని తారల కంటే చలనచిత్రాలలోని తారలంటే జనానికున్న మక్కువ చూసి తను కూడా ఒక చలనచిత్రం చూడాలని మక్కువ పడ్డాడు. తీరా ఒక చలనచిత్రం చూసిన తర్వాత "మూషికా! ఈ చలనచిత్రం ఇలా వుందేమిటి? అంతసేపు చూసినా ఆ కథేమిటో గందరగోళంగా వుండి కొంచెం కూడా అర్థం కాలేదు. ఆ భాషేమిటి అలా వుంది? అసలు అది ఏం భాష? అన్ని భాషల కలగాపులగమా? లేక నాకు తెలీని మార్పులేవన్నా ఆ భాషలో వచ్చాయా?" అని అడిగాడు ఆశ్చర్యంగా. "శివశివా! ఎంతమాట అన్నారు స్వామీ! వ్యాస మహాముని వేగానికి ఏమాత్రమూ తీసిపోకుండా శ్రీమద్భారతాన్ని అతి సులువుగా వ్రాసిన వుద్దండులు, అన్ని భాషలలోనూ అతిప్రజ్ఞాశాలురు, మీకు తెలీని భాషనా? అది వారు చేస్తున్న భాషాపచారం కానీ ఇంకోటేమీ కాదు" అంటూ మూషికుడు వినాయకుని అనుమానాన్ని తీర్చాడు. "ఆ సినీతారల వలువలు అలా వున్నాయేమిటి? వలువలకేమన్నా కరువా? అంత అతి తక్కువ వలువలు కట్టుకుని మిగిలిన దేహాన్నంతా అలా బాహాటంగా ప్రదర్శిస్తున్నారెందుకు? పురాతన సంప్రదాయాలను మర్చిపోకుండా, తరతరాల సంస్కృతి, కట్టుబాట్ల విలువలను గౌరవించే దేశం కదా ఇది! మరి ఇక్కడి చలనచిత్రాలు వాటికి విరుద్ధంగా ఇలా వున్నాయేమిటి?" అంటూ తెగ ఆశ్చర్యపడిపోయాడు వినాయకుడు. ఆయన అనుమానాలు ఇంకా తీరలేదు. "స్వామీ! ఇవన్నీ తూర్పు దేశాల మీద పశ్చిమ దేశాల ప్రభావాలు. అక్కడివారిని అనుకరించాలని ఇక్కడివారు పడుతున్న పాట్లు" అని మూషికరాజు వివరిస్తే వినాయకుడికి ఆ పశ్చిమ దేశాలు చూడాలని చాలా కుతూహలం కలిగింది. అనుకున్నదే తడవుగా వెంటనే అమెరికాలో ఎగిరి వాలాడు. అక్కడి చలనచిత్రం ఒకటి చూడాలని ఆలశ్యం చేయకుండా వెంటనే ఒక చలనచిత్ర ప్రదర్శనశాలకి వెళ్ళి 'ఈ ప్రదర్శనశాలలు భారతదేశంలోనే చాలా బాగున్నాయి. పెద్దగా ఎంతో విశాలంగా వున్నాయి' అనుకున్నాడు. ఆ చలనచిత్రం మాత్రం పూర్తిగా చూడలేక, దానిలోని అతి శృంగార ప్రదర్శనలు, హింసాకాండ నచ్చక మధ్యలోనే బయటకు వచ్చాడు. 'అమ్మో! మరీ ఇంత బహిరంగంగా అన్నీ చూపిస్తున్నారు. ఇంకొంచెంసేపు అక్కడే వుంటే ఇంకా ఏం చూడాల్సివచ్చేదో' అనుకున్నాడు భయంగా చమటలు తుడుచుకుంటూ. ఇంతలో వినాయకుడి దృష్టి ఎదురుగా వున్న కొంతమంది అమెరికను

యువతీయువకుల మీద పడింది. ధూమపానంతో పాటు సురాపానం కూడా చేస్తూ ఏమిటో తింటున్నారు, తూలిపోతున్నారు. "స్వామీ! వారు ఇంత చిన్న వయసులోనే ధూమపానం, సురాపానం తో పాటు మాదక ద్రవ్యాలు కూడా వాడుతున్నారు' అన్నాడు మూషిక రాజు మెల్లగా వినాయకునితో. ఇలాంటి అపాయకరమైన అలవాట్లకి, మనుషులకే దూరంగా వుండమని మాత మరీ మరీ చెప్పింది అనుకున్నాడు వినాయకుడు మనసులో. "మూషికా! ఆ యువతీయువకులను మార్చటానికి కాస్త ప్రయత్నిద్దామా?" అన్నాడు అయినా మనసాగక. "వద్దు స్వామీ! మనది కులాసా యాత్ర మాత్రమే! ఇలాంటివాటిల్లో తల దూర్చి తిప్పలు తెచ్చుకోవద్దని మాత మరీమరీ హెచ్చరించటం మర్చిపోయారా?" అన్నాడు మూషికం. అసమంజసంగా వినాయకుడు ముందుకు నడుస్తూ వుంటే ఎదురుగా ఒక గుడి కనిపించింది. 'అరె, ఈ అమెరికా దేశంలో కూడా మన హిందూ మతానికి చెందిన గుడి వుందే! ఇక్కడ కూడా భారతీయులు చాలామందే వున్నారన్నమాట" అనుకుంటూ ఆ గుడి లోపలికి అడుగు పెట్టాడు మూషికంతో సహా. అక్కడ అందరూ పదకవితాపితామహుడు అన్నమాచార్యుని ఆరువందల పుట్టినరోజుని అమర సంకీర్తనారాధనతో చాలా వైభవంగా జరుపుకుంటున్నారు. అతిసామాన్యుడిలాగా ఈ మానవలోకంలో పుట్టినా తన అపూర్వ భక్తి సంపదతో, అసమాన్యమైన పద కవితా భాండారంతో ఆ విష్ణులోక సాన్నిత్యాన్ని పొందిన ఆ అనన్య వాగ్గేయకారుని సంగీత ప్రతిభలు విష్ణులోకంలో వినివున్నాడు వినాయకుడు. ఆయన అమర సంగీతాస్వాదన కోసం అన్ని లోకాలవారు ఆయన్ని సంగీత కచేరీలు ఇవ్వమని ఆహ్వానిస్తూనే వుంటారు. భూలోకంలో ఆయన తనువు చాలించి ఇన్నేళ్ళయినా ఇంకా ఆయన ప్రతిభావిశేషాలని అందరూ గుర్తు పెట్టుకోవటం, అందులోనూ విదేశాలలో వుంటున్నా తమ దేశ సంప్రదాయాలను ఇంకా ఆచరించటం ఈ భారతీయుల గొప్పదనం అని మనసులో వారిని మెచ్చుకున్నాడు వినాయకుడు. తమ సంస్కృతి, సంప్రదాయాలను తోసిరాజని పశ్చిమ నాగరికత కోసం భారతదేశంలో జనాలు అర్రులు చాస్తుంటే అమెరికాలోని భారతీయులు మాత్రం తాము, తమ పిల్లలు తమ భాషా సంప్రదాయాలు, మతం, సంస్కృతి ఎక్కడ మర్చిపోతామో అని ఇంకొంచెం ఎక్కువ భయం, భక్తి, శ్రద్ధలతో వాటిని పాటించటానికి అదనపు పరిశ్రమ చేస్తున్నారు. దగ్గరున్నదాని విలువని అశ్రద్ధ చేయటం, కోల్పోయిన తర్వాత కానీ దాని విలువని గ్రహించకపోవటం మానవ సహజమైన నైజం అనుకున్నాడు వినాయకుడు. పరాయి దేశమైనా అమెరికాలో వారి గుడులు, గోపురాలు కట్టుకున్నారు. వారి దేవుళ్ళని ప్రతిష్ఠ చేసి నిత్య పూజలు, పునస్కారాలు చేస్తున్నారు. తనకి కూడా ప్రత్యేకమైన గుడి Nashville లో వుంది. ప్రతీ చోటా భారతదేశం నుండి ఎంతోమంది గురువులు, సన్యాసులు వచ్చి అక్కడి ప్రజలకి అనేక సద్బోధనలు చేస్తున్నారు. భారతదేశంలో వారు చెయ్యాలనుకున్న సమాజ సేవకు కావలసిన ధనాన్ని ఇక్కడి ప్రజల దగ్గర చందాల ద్వారా పోగుచేస్తున్నారు. వీరందరికీ వారి దేశంలో కంటే ఇక్కడే పలుకుబడి ఎక్కువని, వీరి మాటలకి, బోధలకి అక్కడకంటే ఇక్కడే విలువ ఎక్కువని వినాయకుడు తేలికగానే గ్రహించాడు. అందుకనే శారీరక వ్యాయామానికి కూడా జనానికి గురు బోధలు బాగా ఉపయోగపడుతున్నాయి. వ్యాయామం, శారీరక పరిశ్రమలు అందానికే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా అవసరం అనుకున్నాడు వినాయకుడు ఒక్కసారి తన శరీరం వైపు చూసుకుంటూ. చలనచిత్ర తారలు కూడా తరుచుగా ఇక్కడికి వచ్చి అనేక ప్రదర్శనలు ఇస్తున్నారు. జనం వేలంవెర్రిగా చూస్తున్నారు. మొత్తానికి అమెరికాలో భారతీయుల జీవనం చాలా బాగుంది. సంపదతో, వైభవంతో పెద్ద పెద్ద భవనాలలో నివసిస్తున్నారు. పెద్ద పెద్ద వాహనాలలో చరిస్తున్నారు. ఇవన్నీ బాగానే వున్నాయి, కానీ భారతదేశంలో కంటే ఇక్కడ ఎక్కువగా కులాల పట్టింపు, కక్ష, పోట్లాటలతో ఎందుకు రగులుతున్నారు? ఇన్ని వేల మైళ్ళు వచ్చి, ఇంత చదువులు చదివి, ఇంత ధనార్జన చేస్తూ, గురువులు, గుళ్ళు, గోపురాలు అంటూ భక్తి పారవశ్యంలో మునుగుతూ కూడా అర్థం పర్థం లేని కులాల పట్టింపులతో, అహంకారాలతో ఎందుకు జీవితం అశాంతిపాలు చేసుకుంటున్నారు? అనుకుంటూ కొంచెం తికమక పడ్డాడు వినాయకుడు. కానీ మళ్ళీ భారతదేశంలో లాగానే ఇక్కడ కూడా భారతీయుల పిల్లలు వారికి రాకపోయినా సరే, వారి మాతృ భాషలో సంగీత నాట్యాలలో చూపిస్తున్న ప్రతిభావిశేషాలు, సాహిత్యాభిమానుల కృషి, పరిశ్రమలను చూసి మెచ్చుకోకుండా వుండలేకపోయాడు.

ఇవన్నీ చూసిన తర్వాత వినాయకుడికి ఇంక అమెరికా పర్యటన ముగించి ఆస్ట్రేలియా వెళ్ళాలనిపించింది. "ఆస్ట్రేలియానే ఎందుకు స్వామీ?" అని మూషికుడు ఆశ్చర్యంగా అడిగితే "భూమధ్యరేఖకు పైన వున్న దేశాలు ఇంతవరకు చూసాం. ఇప్పుడు భూమధ్యరేఖకు దిగువుగా వున్న దేశం కూడా చూడాలనిపిస్తోంది. పైగా ఆస్ట్రేలియా ఒక ఖండము, ఒక దేశము కూడా. అక్కడ చిత్ర విచిత్రాలకేమీ లోటు వుండదని నా నమ్మకం. అందుకే అక్కడికి వెళ్దాము" అన్నాడు. ఆయన అన్నట్లుగానే చుట్టూ సముద్రంతో మధ్యలో వున్న దీవిలాగా అందం, ఐశ్వర్యాలతో మెరిసిపోతోంది ఆస్ట్రేలియా. పూర్తిగా దక్షిణ మండలంలో వుండటం వలన ఉత్తర మండలంలో కంటే ఋతువులలోనూ, వాతావరణంలోనూ, అన్నిటిలోనూ ఇక్కడ పూర్తిగా వ్యతిరేకం. బాగా అభివృద్ధి చెందిన దేశం కాబట్టి చాలా అందంగా, ఆనందంగా వుంది. ప్రజల జీవనం చాలా సులువుగా సాగేందుకు కావలిసిన ఆధునిక హంగులన్నీ పుష్కలంగా వున్నాయి. అక్కడి ప్రజలు చాలా స్నేహశీలులు. ఎంతో మర్యాదతో కూడిన వారి మాట, ఎదుటివారిని గౌరవించే వారి మన్నన, కష్టించటానికి

వెనుకాడని వారి స్వభావం, వారి పట్టుదల, నిజాయితీలు ఇవన్నీ వినాయకుని మనసుని బాగా ఆకట్టుకున్నాయి. వారికి క్రీడల మీద బాగా ఎక్కువ మక్కువ వుందని వినాయకుడికి బాగా అర్థం అయిపోయింది. అదేమిటో బంతి ఆట, దాన్ని క్రికెట్ అంటారట, దానిని ఆడటంలో భూలోకంలోని దేశాలన్నిటిలోనూ వీరే అగ్రగణ్యులట. మరి బాలురు మాత్రమే ఆడే ఆ ఆటలో కొంతమంది బాలికలు ఏవేవో వింత బంతులను వూపుతూ గెంతుతున్నారెందుకు? అర్థం కాక ఈ ప్రశ్నను మూషికాన్ని అడిగితే "స్వామీ! వారిని cheer leaders అంటారు. క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్సాహపరచటమే వారి పని" అని మూషికరాజు విశదీకరించాడు. అలాగా అనుకున్నాడు వినాయకుడు కొత్త విషయాన్ని తెలుసుకుని. క్రీడలలో ప్రతిభాపాటవాలు వుండటం మంచిదే, ఆరోగ్యకరమైన లక్షణమే, బాగు బాగు అనుకున్నాడు మెచ్చుకోలుగా వినాయకుడు. భూలోకం మొత్తంలో అతి ప్రశస్తమైన వూలు అక్కడే దొరుకుతుందిట. తాకితే ఎంతో మెత్తగా వుంది. ఆ జంతు చర్మాల బదులు ఇది కట్టుకుంటే మెత్తగానూ వుంటుంది, వెండి కొండ మీద చలి ఎక్కువగా అనిపిస్తే వెచ్చగాకూడా వుంటుంది అని తండ్రికి చెప్పాలి అని నిర్ణయించుకున్నాడు మనసులో. అక్కడి Coral reef ని చూసి 'ఆహా! భూలోకం చిత్రవిచిత్రాలతో కూడి వుంటుందని, అమిత సౌందర్యభరితమని తమ్ముడు ఇందుకే అన్నాడు సుమా!' అనుకున్నాడు మనసులో. అమెరికాలో చూసిన నయాగరా జలపాతాలు, Grand canyon శిధిలాలు, భారతదేశంలో చూసిన తాజ్ మహల్ పాలరాతులు, హంపి, అజంతా, ఎల్లోరా శిల్పాలు, కోణార్క్ సూర్య దేవాలయం, కాశ్మీరు లోయల వింత అందాలు - ఇలా ఎన్నో ఒక్కసారి మనసులో మెదిలాయి. ఇక్కడి భారతీయులు కూడా అమెరికాలో లాగానే వారి దేశాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ఏమాత్రం మర్చిపోలేదు. అలాగే వారి మతాన్ని, పూజలను, భక్తిని కూడా ఏమాత్రం మర్చిపోలేదు. మత సంబంధమైన, దైవ సంబంధమైన అనేక కార్యక్రమాలతోపాటు, లలిత కళలకి సంబంధించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ తమ సంస్కృతిని కాపాడుకొంటున్నారు. తమ పిల్లలకు గుర్తుండేలా చేస్తున్నారు. చూస్తున్న వినాయకుడికి మహా ముచ్చటేసింది. ఇలా ఆలోచిస్తూ వినాయకుడు అక్కడ ఎవరి ఇంట్లోనో సత్యనారాయణ పూజ జరుగుతూ వుంటే అక్కడే నిలబడి ఆ పూజంతా శ్రద్ధగా చూసాడు. ఆ వూళ్ళోనే వున్న కోవెల లోనుండి పూజారిగారిని పిలిపించి వాళ్ళు చాలా శ్రద్ధగా ఆ పూజ చేసారు. పూజ, భోజనాలు అంతా అయిన తర్వాత ఆడవాళ్ళు పనిలో పడితే కొంతమంది మగవాళ్ళు కబుర్లు, ఆటలలో పడ్డారు. కానీ వారు ఆడే ఆట ఏమిటో వినాయకుడికి కొంచెం కూడా అర్థం కాలేదు. "స్వామీ! అది జూదం లాంటిది. దాన్ని పేకాట అంటారు" అని మూషికుడు వివరించాడు. 'ఇంటికి గురువుని పిలిచి చక్కగా యధావిధిగా పూజ చేసుకుని ఆ సంరంభం ఇంకా సద్దుమణగకమునుపే ఈ జూదాలేమిటి' అని వినాయకుడికి కాస్త మనసు చివుక్కుమనిపించింది. "స్వామీ! మీరేం ఆలోచిస్తున్నారో నాకు తెలుసు. మీరేమీ బాధపడకండి. రోజులు మారాయి. మనం కూడా మారాలి. లేకపోతే మన దేవుళ్ళకి కూడా ముప్పులు తప్పవు. కాస్త చూసీ చూడనట్లు, వినీవిననట్లు అన్నీ సర్దుకుపోవటం నేర్చుకోవాలి' అన్నాడు మూషికుడు వినాయకుని సముదాయిస్తూ. 'అవునులే! శ్రద్ధగా పూజ చేసారుగా! ఇంక ఆ తర్వాత మనం పట్టించుకోకూడదు' అనుకున్నాడు మనసులో సరిపెట్టుకుంటూ. పూజలో ఆస్వాదించిన ప్రసాదాలకి ఆయనకి తెగ భుక్తాయాసంగా వుంది. ఇంతలో అక్కడి ఆడవారందరూ చకచకా పనంతా ముగించుకుని ఎక్కడికో వెళ్ళటానికి సిద్ధమవుతున్నారు. వినాయకుడికి వారందరి హడావుడి ఏమిటో మళ్ళీ అర్థం కాలేదు. "స్వామీ! వారు ధరించే దుస్తులు చాలా చవక ధరలకి అమ్ముతున్నారట. ఆ సరసమైన ధరలకి ఇవాళే ఆఖరి రోజట. అందుకని వీరందరూ ఆ దుస్తుల విక్రయశాలకి వెళ్తున్నారు. అందుకే వారందరికీ ఆ కంగారు" అని మూషికుడు వినాయకుడికి వారందరి కంగారు కారణాన్ని విశదీకరించాడు. వినాయకుడు మూషికం వైపు 'నీకన్నీ తెలుసు. నువ్వు లేకపోతే నేనేమయిపోయేవాడనో' అన్నట్లు మెచ్చుకోలుగా చూసాడు. ఈ పరాయిదేశాల్లో సహాయం చేయటానికి ఎవరూ లేక అన్ని పనులూ మనమే చేసుకోవలసిరావటంతో ఎంతో అలిసిపోతున్నామంటూ ఇందాకే విసుక్కున్న ఆడవారందరూ దుస్తులు కొనుక్కోవటానికి మాత్రం చాలా హుషారుగా తయారయి వెళ్ళటం చూస్తే చాలా నవ్వు వచ్చింది. 'ఎంతైనా ఆడవారు చాలా అలంకార ప్రియులు సుమా!' అనుకున్నాడు మనసులో.

వినాయకుడికి చూసినంత వరకు భూలోకం చాలా నచ్చింది. ఇంకొంత కాలం అక్కడ గడపాలని, ఇంకొన్ని దేశాలు చూడాలని, ఇంకొన్ని చిత్రవిచిత్రాలు అనుభవించాలని చాలా కోరిక కలిగింది. కానీ తల్లి ఇచ్చిన గడువు అయిపోయింది. "ప్రభూ! మాత ఇచ్చిన గడువు అయిపోయింది. గడువు దాటే లోపు వెనక్కి వస్తామని మాతకి మాట ఇచ్చాం. వెంటనే వెండి కొండకు వెళ్ళకపోతే ముప్పు రావటం తథ్యం" అంటూ మూషిక రాజు హెచ్చరిక కూడా చేసాడు. 'ఇక్కడి వింత అనుభవాలన్నీ మాతాపితరులకి విపులంగా చెప్పాలి. ఇక్కడి అందచందాలు, వింతలు, విడ్డూరాల వన్నెచిన్నెల వర్ణనలు విని వారు కూడా ఇక్కడికి పర్యటించటానికి రావాలని కోరుకునేలా చేయాలి. అప్పుడు తనకి భూలోకానికి మళ్ళీ రావటానికి అవకాశం వుంటుంది' అనుకున్నాడు వినాయకుడు మనసులో ఆశగా, శివలోకానికి తిరిగి వెళ్తూ.

00000